క్లుప్తంగా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా వంశీకృష్ణ



సంగెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా వంశీకృష్ణ నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో పనిచేసిన డాక్టర్ అశోక్‌కు పీజీలో సీటు రాగా ఇన్నాళ్లు పర్వతగిరి రెండో వైద్యాధికారి ఉదయ్‌రాజ్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం నెల్లికుదురు వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ బదిలీపై సంగెం వచ్చారు. వైద్యాధికారి వంశీకృష్ణకు సిబ్బంది పూలబొకే అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

రాయపర్తి ఎంపీఓగా ప్రకాశ్

రాయపర్తి: మండల పంచాయతీ(ఎంపీఓ) అధికారిగా కూచన ప్రకాశ్ మంగళవారం విధుల్లో చేరారు. గతంలో ఎంపీఓగా పని చేసిన తుల రామ్మోహన్ నర్సంపేటకు బదిలీ కాగా నల్లబెల్లి మండలంలో విధులు నిర్వర్తించిన ప్రకాశ్ ఇక్కడకు వచ్చారు.

దాతల సాయంతో నిర్మాణం

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామంలోని గుట్టపై చేపట్టిన లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయం దాతల సాయంతోనే నిర్మిస్తున్నామని ఆలయ అర్చకులు శివకృష్ణాచార్యులు తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన ఎడ్ల బక్కారెడ్డి– కవిత రూ.50వేలు, మండల మునిందర్–స్వాతి రూ.20వేలు విరాళం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దొంతి మధుకర్‌రెడ్డి, మండల అనిల్, గంధం నాగరాజు, హనుమాండ్ల మల్లేశం ఉన్నారు.

చెరువు కట్టకు మరమ్మతు



పర్వతగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చింతనెక్కొండ పెద్ద చెరువు కట్ట కోతకు గురైంది. దీంతో చెరువు కట్టకు మంగళవారం ఐబీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మళ్లీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుకోకుండా నాణ్యతతో పనులు చేపట్టాలని తహసీల్దార్ వెంకటస్వామి ఐబీ అధికారులకు సూచించారు.

క్రీడాకారుడికి సన్మానం



నర్సంపేట: అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి జూలై 9నుంచి 12వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించిన సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన తూర్పాటి యోగేశ్వర్‌ను మంగళవారం వరంగల్ జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్, జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి మాట్లాడారు. యోగేశ్వర్‌కు ఆర్థిక సాయం అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాట రవికుమార్, గూడెపు భిక్షపతి, సోనబోయిన సారంగపాణి, లక్ష్మయ్య, రాంబాబు, దేవీలాల్, ప్రశాంత్, భవానిచంద్, శేఖర్, విజేందర్, సిరపురపు మహేష్ పాల్గొన్నారు.

జీపీఎస్, ఆఫీస్ సబార్డినేటర్ల బదిలీ

చెన్నారావుపేట: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆఫీస్ సబార్డినేటర్లు బదిలీ అయినట్లు ఎంపీడీఓ గడ్డం దయాకర్, ఎంపీఓ శ్రీధర్‌రాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ గ్రేడ్–1 జీపీఎస్ షకీల్ అహ్మద్ గీసుగొండ మండలానికి, పాపయ్యపేట గ్రేడ్ –2 జీపీఎస్ అశోక్ నర్సంపేట మండలం మహేశ్వరానికి, లింగాపురం గ్రేడ్ –2 జీపీఎస్ శ్వేత నర్సంపేట మండలం గురిజాలకు, అక్కల్‌చెడ గ్రేడ్ –3 జీపీఎస్ సత్యనారాయణ రాయపర్తి మండల సన్నూరుకు బదిలీ అయినట్లు వెల్లడించారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన సారంగం లింగగిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు, ఉప్పరపల్లి హైస్కూల్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన నీల ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. మండలంలోని సూర్యాపేట తండా జీపీఎస్‌గా స్వప్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఖానాపురం మండలం అయోధ్యనగర్ గ్రామ పంచాయతీ గ్రేడ్–4 కార్యదర్శిగా పనిచేసి బదిలీపై సూర్యాపేట తండాకు వచ్చింది. అలాగే అక్కల్‌చెడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా తిప్పని చేరాలు బాధ్యతలు చేపట్టారు. ఖానాపురం మండలం దబ్బిరిపేట గ్రేడ్–3 కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి
- నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి తనిఖీ

నర్సంపేట/నర్సంపేట రూరల్: నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రిలోకి గైనిక్, పిడియాట్రిక్, డయాలసిస్, జనరల్ వార్డులను సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూపరింటెండెట్ గోపాల్‌ను ఆదేశించారు.

31లోగా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలి..

నర్సంపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల, ఆస్పత్రి పనులు ఈనెల 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అధికారులతో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలోని బ్లాక్‌ల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరి శీలించారు. ఆర్డీఓ కృష్ణవేణి, వైద్య కళాశాల ప్రిన్సి పాల్ కిషన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్, టీజీఎం ఐడీసీ ఈఈ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. చంద్రయ్యపల్లి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు.



నర్సంపేట ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఎకోటూరిజంగా పాకాల అభివృద్ధి

ఖానాపురం: పాకాలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. అశోక్ నగర్ శివారులోని బ్రిడ్జి, పాకాల సరస్సు, తూ ములు, మత్తడి, లీకేజీ నీటిని పరిశీలించారు. పాకాలలో స్పీడో మీటర్లు ఏర్పాటు చేయాలని డీఆర్వోకు సూచించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాకాల అభివృద్ధి కోసం ప్రాజెక్టు డిజైన్ చేసి టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ ఈఈ సాల్మన్‌రాజ్, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీఈ రమేశ్, ఏఈ స్వాతి, ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

బురద ఉంటే పిల్లలు ఎలా వస్తారు?

నల్లబెల్లి: అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు బురదమయంగా ఉంటే పిల్లలు ఎలా వస్తారని కలెక్టర్ సత్య శారదాదేవి అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–3, బీసీ హాస్టల్‌ను మంగళవారం సందర్శించారు. డ్రాయింగ్ చార్ట్‌లోని అక్షర దోశాలను సవరించాలని టీచర్ భాగ్యలక్ష్మికి సూచించారు. రాయపర్తి మండలంలోని గట్టికల్, పర్వతగిరి మండలంలోని పెద్దతండా, గీసుకొండ మండలంలోని కొమ్మాల, నల్లబెల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం పక్కనే శిథిలావస్థలో ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలించి విద్యార్థుల గురించి తెలుసుకు న్నారు. డీడబ్ల్యూఓ హైమావతి, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఎస్సై ప్రశాంత్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, ఏపీఓ వెంకట్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ఉన్నారు.



నల్లబెల్లి : బురదలో నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న కలెక్టర్

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం

చెన్నారావుపేట: వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సరోజ అన్నారు. మంగళవారం మండల కేంద్రం చెన్నారావుపేట, ధర్మాతండాలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో డ్రమ్ములు, బకెట్లు, పనికి రాని వస్తువుల్లో వారానికి పైగా నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీఓ శ్రీధర్, సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, రామెల్, సువార్త, పుష్పలత, కాంతి, సరిత, సురేందర్, సరియ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సరోజ

నారాయణతండాలో వైద్య శిబిరం

దుగ్గొండి: నారాయణతండా గ్రామంలో దుగ్గొండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 72 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పృథ్వీరాజు మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చాణక్య, ఏఎన్ఎం బుజ్జమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సత్యం



చెన్నారావుపేట: చెన్నారావుపేట ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన బండారి సత్యంను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంది కృష్ణారెడ్డి, సిద్ధ ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా సాదు రాజు, ప్రధాన కార్యదర్శిగా కొట్టం మోహన్, క్యాషియర్‌గా ఉప్పుల రాజు, జాయింట్ సెక్రెటరీగా అంధ్ర చిన్నయ్య, కార్యవర్గ సభ్యులుగా సుంకరి చిరంజీవి, సింగారపు ప్రవీణ్, కందికొండ రాజు, కరెడ్ల శివ, జంగిలి ప్రశాంత్, ముఖ్య సలహాదారులుగా నాంపెల్లి సంపత్, ముదురుకోళ్ల భిక్షపతిని ఎన్నుకున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

వర్ధన్నపేట: దివ్యాంగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని మంగళవారం మండలంలోని ఇల్లందలోని వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. గంట పాటు చేసిన రాస్తారోకోతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళన కారులను సర్ది చెప్పే ప్రయత్నం చేసినా విరమించకపోవడంతో వారిని బలవంతంగా రోడ్డుపై నుంచి ఖాళీ చేయించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆందోళనకారులను అరెస్టు చేసి స్వంత పూచీ కత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ.. దివ్యాంగుల ఫించన్ పెంపుపై సీఎం రేవంత్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 'స్థానిక' ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించిన ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత రవాణా కల్పించడం విస్మరించదని దుయ్యబట్టారు. దివ్యాంగులకు రూ.ఐదు లక్షల వరకు షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని కోరారు. షరీఫ్, ఈదయ్యబాబు, నర్సింహులు, సుమతి, శ్రీనివాస్, బాలకృష్ణ, మత్స్యగిరి, రాజన్న, లింగారెడ్డి, ముత్తయ్య, శేఖర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబుగౌడ్ అధ్యక్షతన పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలను రాణాప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ అన్నారు. పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్రరెడ్డి, దళిత మోర్చా జిల్లా కో కన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మినుముల రాజు, కౌన్సిలర్లు జుర్రు రాజుయాదవ్, గోల్యానాయక్, కవితవీరన్న, తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రజాప్రతినిధులను చేయడమే లక్ష్యం

దుగ్గొండి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతను ప్రజా ప్రతినిధులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు నేదురు రాజేందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. యువత రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ రాంచంద్రారెడ్డి, చిన్న, అన్న లింగన్న, రమేశ్, విష్ణు, సప్తగిరిరెడ్డి, సందీప్, శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలగంగాధర్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామంలో మంగళవారం జనజాగృతి వేదిక ఆధ్వర్యంలో బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి మాట్లాడుతూ.. బాలగంగాధర్ తిలక్ సామాన్య ప్రజలు సైతం గణేశ్ ఉత్సవాలు, శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించుకునేలా చేసి ప్రజల్లో దేశభక్తిని నింపారని గుర్తు చేశారు. ఆజాద్ చంద్రశేఖర్ 15ఏళ్ల వయస్సులోనే ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యాడని తెలిపారు. కుమారస్వామి, రాజ్‌కుమార్, కవిరాజు, రవీందర్, రాజు, భిక్షపతి, బుచ్చి మల్లు, అనిల్, రాజు, శ్రీనివాస్, రాములు, భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దాశరథికి ఘననివాళి

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో దాశరథి శత జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ.. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనిచ్చిన గొప్ప కవి దాశరథి అని కొనియాడారు. లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, కాసుల రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ విముక్తికి కృషి చేసిన మహనీయుడు దాశరథి అని పేర్కొన్నారు. లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏడాది పొడుగునా దాశరథి సాహిత్యంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రఘుపతి, రమేశ్, రాజు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రకృతిని పాడు చేయొద్దు

నర్సంపేట: భక్తితో వినాయకులను పూజించాలి కానీ ఆ పేరుతో ప్రకృతిని పాడు చేయొద్దని డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(డీఏఓ) శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా వినియోగదారుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నిర్మూలన అవగాహన కరపత్రాలను మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మనుషుల శరీరంలో ఒక సంవత్సరానికి పావుకిలో ప్లాస్టిక్ ఇమిడి పోతుందన్నారు. వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల చెరువులోని చేపలు, ఇతర జీవాలు, పశుపక్షాదులు ఆ నీటిని వినియోగించడం వల్ల చాలా వరకు అంతరించి పోతున్నాయన్నారు. రాష్ట్ర క్యాట్కో ఉపాధ్యక్షుడు రతన్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. పర్యావరణం గురించి తెలిసిన మేధావులు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడుతూ పరోక్షంగా ప్రోత్సహించడం బాధాకరమన్నారు. 120మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ఇతర 19రకాల ప్లాస్టిక్‌ను తయారు చేసే వారు, అమ్మే వారిని అరెస్టు చేసి శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, హనుమకొండ విజిలెన్స్ కమిటీ మెంబర్ బండ కాళిదాసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ విజయరావు, డిప్యూటీ తహసీల్దార్లు కట్ల కిరణ్, రాజారేణుక, సీనియర్ అసిస్టెంట్స్ సంపత్, వజీర్, రషీద్, జూనియర్ అసిస్టెంట్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఏఓ, తదితరులు

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులకు బెస్ట్‌ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రం మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ బాధ్యులు పులి దేవేందర్, పిన్నింటి బాలాజీరావు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 38మందికి మెటీరియల్ అందించినట్లు తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ గ్రేడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం హెచ్ఎం జయ మాట్లాడుతూ.. బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో పాలిటెక్నిక్ పరీక్ష రాసిన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మొగిలి, సీహెచ్ మాధవి, సుందర్, మాధవి, రమాదేవి, సతీష్‌కుమార్, స్వప్న, జాహీద్, చింతకింది ఇందిర ఉన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

నర్సంపేట: అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని భద్రకాళి ఒకేషనల్ కళాశాలలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలని కోరారు. అజిత్, శ్రీకాంత్, కల్యాణ్, ప్రశాంతి, కల్పన, లావణ్య, రజిత, సుశీల పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కొమ్ముక రవి డిమాండ్ చేశారు. మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్న ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరం అన్నారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో విద్యాశాఖ ఉండడం వల్ల పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. విద్యార్థులకు నేటికి పుస్తకాలు అందలేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో విద్యారంగం విధ్వంసానికి గురైందని, ఆ అనుభవాల నుంచి ప్రభుత్వం మేల్కొని విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సాయిగణేష్, రవితేజ, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట: ఇంతకు ముందు రైతుబీమా చేసుకోని రైతులు ఈ సంవత్సరం రైతుబీమా చేసుకునే అవకాశం ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట మండల వ్యవసాయాధికారి సాగరిక తెలిపారు. నిబంధనలు వెల్లడించారు. ధరణీ పోర్టల్‌లో జూన్ 28, 2024 తేదీలోపు పట్టా చేసుకున్న రైతులు, కొత్తగా ఆర్ఓఎఫ్ఆర్ పట్టా అయిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. రైతులు 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, ఆధార్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎన్ని చోట్ల భూమి ఉన్నా ఒక గ్రామంలో మాత్రమే బీమాకు అవకాశం ఉంటుందన్నారు. రైతే స్వయంగా ఏఈఓకు వివరాలు అందజేయాలని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గీసుకొండ: వరంగల్ నగరంలోని 15వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. మంగళవారం గొర్రెకుంటలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన మర్ద సాంబయ్య ఇటీవల వృత్తిలో భాగంగా తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.25వేలు మంజూరు కాగా మంగళవారం బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్, గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ స్టేట్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్‌లు సాంబయ్య కుటుంబ సభ్యులకు అందించారు. గోడిశాల సదానందం, గోపగాని వెంకన్న, మచ్చికరాజుగౌడ్, రాజేశ్వర్, మల్లికార్జున్, మలయ్య, రాము, గిరి, శ్రీనివాస్, సతీష్, వెంకట్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

దళిత అభివృద్ధి శాఖ ఏర్పాటు చేయాలి

చెన్నారావుపేట: రాష్ట్ర ప్రభుత్వం దళిత అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసి, మంత్రిని కేటాయించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజనుల సమగ్ర అభివృద్ధిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలన్నారు. కాంగ్రెస్ చేవేళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేడ్కర్ అభయ హస్తం రూ.12లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

నర్సంపేట వాసికి డాక్టరేట్



మేరుగు లక్ష్మి

నర్సంపేట: పట్టణానికి చెందిన మేరుగు లక్ష్మి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. లక్ష్మి జువాలజీ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణ ఆధ్వర్యంలో పరిశోధన గ్రంథం పూర్తి చేశారు. దీంతో డాక్టరేట్(పీహెచ్‌డీ) పట్టా పొందింది.

కమిటీలు కాదు.. పాత పెన్షనే కావాలి

నర్సంపేట/ చెన్నారావుపేట: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని భావించిన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం సీపీఎస్ విధానాల్లోని లోపాలను సరిదిద్దడానికి కమిటీని నియమించడం బాధాకరమని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల ఉద్యోగ ఉపాధ్యాయులు, దేశ వ్యాప్తంగా ఉన్న 90లక్షల ఉద్యోగులు ఎంతో నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వాలు వెంటనే దీన్ని గుర్తించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు పన్నులు తగ్గిస్తున్న ప్రభుత్వం ప్రభుత్వంలో భాగమై, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉద్యోగుల పట్ల మొండి చేయి చూపడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

వర్ధన్నపేట: జిల్లాలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని వర్ధన్నపేట పట్టణానికి చెందిన జిల్లా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ గుడిబోయిన సారంగపాణి జిల్లా మత్స్యశాఖ అధికారిని కోరారు. మంగళవారం వరంగల్ మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణిని కలిసి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన ముత్తినేని శ్రీనివాస్ (56) వరంగల్‌లోని ఓ హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల గ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంటి స్లాబ్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, కుమారుడు రాజవంశీ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం

నర్సంపేట:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉందని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల దేశంలోని రైతులు, కూలీలు, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను నేటికీ రద్దు చేయలేదన్నారు. వ్యవసాయ రంగానికి కనీసం పది శాతం బడ్జెట్ కూడా కేటాయించకపోవడం సరికాదన్నారు. వ్యవసాయ ఉపకరణాలు, రైతులు వాడే వస్తువులపై జీఎస్టీని ఎత్తి వేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు జరగకపోవడం తీరని ఆవేదన కలిగిస్తుందన్నారు.

కేంద్రం వైఖరిని ఖండిస్తున్నాం

రాయపర్తి: కేంద్ర ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరించి తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అన్నారు. పార్టీల మధ్య విభేదాలను తొలగించి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం అనేక పర్యాయాలు ప్రధానిని కలిసినా వివక్ష పూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు.

ప్రమోషన్లు ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూదే..

నల్లబెల్లి: ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇప్పించి, బదిలీలు చేయించిన ఘనత పీఆర్‌టీయూకే దక్కిందని ఆ సంఘం మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్ అన్నారు. రుద్రగూడెం, నారక్కపేట, మేడపల్లి, మూడుచెక్కలపల్లి, గుండ్లపాహాడ్, కొండాపూర్, ఆసరవెల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో ప్రభుత్వంతో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిధుల బృందం చర్చించి ఏకీకృత సర్వీసు రూల్స్ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయులకు ఎంఈఓ, డిప్యూటీ ఈఓ, జూనియర్ లెక్చరర్‌లుగా ప్రమోషన్లు లభించే అవకాశం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం ప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, సుధాకర్ రావు, కృష్ణమూర్తి, వెంకట్రాంనర్సయ్య, బానోత్ కృష్ణ, కృష్ణమూర్తి, లాక్య, దామోదర్, సుధాకర్, రాము, కుమారస్వామి, రవీందర్ పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావొద్దు

దుగ్గొండి: యువత మత్తుకు బానిసలుగా మారి గుట్కాలు, అంబర్, గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నారని ఫలితంగా బంగారు భవిష్యత్ బుగ్గిపాలు అవుతుందని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చలపర్తి గ్రామంలో పోలీస్ కళాజాగృతి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. తల్లిదండ్రులకు శోకం మిగల్చకుండా ఉన్నతంగా చదువుకుని భవిష్యత్‌లో మంచిస్థానంలో స్థిరపడి కన్నవారికి మంచి పేరు తీసుకురావాలన్నారు. బాలికలు, యువతులను ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. మూఢ నమ్మకాలతో నష్టపోకుండా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. కళాజాత ఇన్‌చార్జ్ నాగమణి, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.